# అరణ్యపర్వం

బూర్జిగూడ – ఇదో, కాదో అని అనుమానిస్తూ; ఆ గూడ వీధిలో కొచ్చాడు పోస్టుమన్. చేతిలో కొద్దిగా ఉత్తరాల దొంతూ, భుజాన పెద్దసంచీ వున్నాయి.

సైకిల్ గూడా పోని, కొండల మధ్యనగల యిలాంటి ఏజెన్సీ గూడలకు సాధారణంగా పోస్టుమేన్, యింతగా కష్టపడి రానేరాడు. యెప్పుడో రిజిస్టర్డు పోస్టు వున్నప్పుడో, ఈ గూడల్లో పంటల సీజనపుడో రాక తప్పదు.

ఎదురుగా తారసపడ్డ వ్యక్తిని ఆపి, "ఇది బూర్జగూడే గదరా నేస్తం?" అని ప్రశ్నించాడు.

"కాదేటిమల్ల?" అని ఎదురు ప్రశ్న వేసాడా నేస్తం.

అవునో, కాదో అని ఈ కొండనాకొడుకు నడిగితే; తిరిగి కాదేటిమల్ల? అని నన్నడుగుతాడేటి? – అని మనసులో తిట్టుకుంటూ..

"బూర్జగూడో, కాదో చెప్పురా నాయినా, ఎండయిపోతోంది. తిరిగింటికెల్లొద్దా?" అని అడిగాడు పోస్టుమేన్.

"ఎవులు కాదన్నారు.....?" మళ్ళీ ప్రశ్నించాడా నేస్తం.

"అయితే బూర్జగూడే కద..." పోస్టుమేన్

"కాదేటి... మల్ల?"

"ఓర్నాయన! మళ్లీ అనుమాన మెట్టీకుగానీ, ఔనొరే నేస్తం, సవరదొంతూ, సవరకొయ్యం, సవర ఇస్రూ.... యీముగ్గురిల్లూ చూపించవా?" అని ఉత్తరాల దొంతు చూస్తూ, పేర్లు చదివి, అడిగాడు పోస్టుమేన్.

ఆ నేస్తం, ఆ ఉత్తరాల్ని దీర్ఘంగా చూసాడు. తరువాత దీర్ఘంగా పోస్టుమేన్‌ని చూసాడు–

"నాకు తెల్దు..." అన్నాడు.

"ఓరె, నీను పోలీసోడ్ని గాదురా! పోస్టుమేన్‌ని" అన్నాడు పోస్టుమేను.

"నాకు తెల్దు" మళ్లీ అదే ధ్వనిలో, అదే గొంతుతో అన్నాడు నేస్తం!

"యేటి తెల్దురా....?"

"యేటీ తెల్దు. పోడుకెళిపోవాల..." ఆనేసి, పోస్ట్‌మేన్ ఎంత పిల్చినా ఆగకుండా, పోడుమీదకి వెళ్ళిపోసాగాడు నేస్తం!

సాధారణంగా పల్లం నుండి తెల్లబట్టలూ, కాకిబట్టలూ వేసుకొచ్చేవారెవర్నీ గిరిజనులు నమ్మరు. అనేక చేదు అనుభవాలు వాళ్ళ నమ్మకాల్ని చెరిపాయి. అంచేత పల్లం నుండొచ్చే వారిని తప్పుకు తిరగడం నేర్చుకున్నారు. తెలిసిన వారైతేగానీ పలకరించరు, మాట్లాడరు.

చివరికెలాగో, ఒక తెలిసిన వ్యక్తి ఎదురుకాగా, అతన్ని బతిమాలి సవరబొంతూ, కొయ్యం, ఇస్రూల యిళ్లు తెలుసుకొని, ఉత్తరాలు బట్వాడా చేసాడు. వేలిముద్రలు తీసుకున్నాడు రిజిస్టర్డు పోస్టుగనుక!

సవరబొంతూ, కొయ్యం, ఇస్రూలు ముగ్గురు మూడు కవర్లు అందుకున్నారు. వాటిని ఎగా, దిగా; అటూ ఇటూ తిప్పి చూస్తూ –

"బావ్, ఇవెక్కడి కాంచొచ్చాయి?" అని అడిగారు.

పోస్టుమేన్ కవర్లు వెనుకవైపు చూసి, సీతంపేట, బ్యాంకు నుంచి అన్నాడు.

"బేంకీ కాంచా"? ముగ్గురూ ప్రశ్నించారు.

"అవును..." చెప్పాడు పోస్టుమేను.

సవరదొంతు చేతిలో కవరటూ, యిటూ తిప్పి –

"యిందలేటున్నాదో యిప్పి, సదివి సెప్పవా?" అనడిగాడు.

"మీకు ఉత్తరాలందివ్వడం దాకే నా డ్యూటీ – సదివి సెప్పటం కాదు...." అనేసాడు పోస్టుమేన్.

"బాబ్బాబు. సదువులేనోలిమి. అందలేటుందో తెల్దు. సదవవా...." అని బ్రతిమాలారు.

"యిప్పుడికే ఎండనెత్తిమీదకొచ్చింది. కొండలు కాలిపోయి, చెవులంట వేడిగాలి కొడతంది. యింటికెప్పుడెల్లాలర్రా.... నేను?" అని మురిపించాడు పోస్టుమేన్.

"ఇదిగీ గడపల మంచమేత్తాను. కూకొని సదివి సెప్పు. సల్లటి జీలుక్కల్లు తెత్తాను. తాగేసి తొంగో! సాయంత్రం బయలెల్లి పోదువ్‌గాని...." అన్నాడు ఇస్రూ!

"జీలుక్కల్లుకి – నీనేటి వోసిపోయిలేను. ఎల్లెర్రా...." అని గసిరేసాడు పోస్టుమేన్.

"పోనీ, పెద్దకందులున్నాయి. కసిన్ని సంచీలేత్తాన్లే బావ్...." అన్నాడు బొంతు.

"చిన్నకోడి పెట్టున్నాది. యిత్తాన్లే బావ్...." అన్నాడు కొయ్యం!

ఇలా, తలా ఓ ఆశ ముగ్గురూ చూపగా, లొంగిన పోస్టుమేన్–

'మొండి నా కొడుకులు, ఒదుల్తారేటి బంకలాగ?" అని బెట్టుగా అంటూ, కవర్లు తీసుకొని గడపలో వేసిన మంచమ్మీద ఆసీనుడై కవర్లిప్పాడు.

సదరు మూడు కవర్లలోనా –

అయ్యా!

మీరు మా బ్యాంకు నుండి 12–6–76 తేదీన కామధేను పాడి పథకం కింద, పాడిగేదెల కొనుగోలు నిమిత్తం తీసుకున్న ఋణం రూ.1000/–లు, అక్షరాలా వెయ్యి రూపాయలూ. అసలు, వడ్డీలతో సహా నేటికీ అనగా 31–12–86 తేదీ నాటికి రూ.1634–75లు బాకీ వున్నారు.

ఈ బాకీని, ఈ నోటీసు అందిన వారము దినములలోగా చెల్లించని యెడల, మీపై కోర్టు ద్వారా తగు చర్య తీసుకోబడుననియూ, మీ స్థిరచరాస్తులు స్వాధీనం చేసుకోబడుననియూ తెలియజేస్తున్నాము.

ఈ నోటీసు నిమిత్తము అయిన పోస్టల్ ఖర్చు రూ.3/55లు మీ ఖాతాకు ఖర్చు వ్రాయడమైనది.

ఇట్లు
మీ శ్రేయోభిలాషి
బ్రాంచి మేనేజర్, ... బ్యాంక్.

సదరు మూడు కవర్లలోనా గల, పై విషయాన్ని రాగయుక్తంగా పోస్టుమేన్ చదివి చెప్పగా, ఎంతసేపటికోగానీ వారికర్థం కాలేదు. అర్థమయ్యాక.... వారి ముగ్గురికి కాళ్లూ, చేతులూ ఆడలేదు. గుండెలు దడ దడా కొట్టుకోసాగాయిః!

కడుపునిండా జీలుక్కల్లు తాగి, కందుల సంచీ భుజాన వేసుకొని, కోడిపెట్ట చంకన బెట్టుకొని, సాయంత్రానికి చల్లగా జారుకున్నాడు పోస్టుమేన్.

ఆ నోటీసు కల్గించిన వ్యథతో పాటు, ఉత్తపుణ్యానికి జీలుగకల్లూ, కందులూ, కోడిపెట్టకూడా పోగొట్టుకున్న ఆ ముగ్గురి మనసుల్లో ఆందోళనా, ఆవేదనా చీకట్లు పరచుకుంటున్నాయి.

* * *

పొద్దు పూరాగా కొండల మాటున మలిగింది. బూర్జగూడలో చీకటిపరుచుకుంది. అక్కడక్కడా... వంటపొయ్యిల మంటలూ, ఇళ్లల్లోని ఆముదపు దీపాలూ, చీకటి ఆకాశంలో మసగ్గా వెలిగే చుక్కల్లా వున్నాయి! కొండపోడుల మీద డబ్బాల శబ్దాలు, చింతగేరుల అరుపులు – ఎవరో కొట్టిన దెబ్బలకు అరుస్తోన్న ఆవుదూడ అరుపుల్లా వున్నాయి. కొండల మధ్య బూర్జగూడ – చెట్లకాండాల మధ్య లేచిన తేనెపట్టులా వుంది! అక్కడ్నుండీ తేనె పల్లానికీ, పట్నానికీ ప్రవహించగా.... మళ్లీ పట్టు పెట్టే ఈగల్లా అక్కడి గిరిజన్లున్నారు.

"దేవత అనుకొనీ మొక్కబోతే.... దెయ్యిమయి పీకబట్టుకున్నట్టిగున్నాది. యిపుడేటి

సేత్తామురా.... దద్దా?" అంటూ కొయ్యంగాడి దగ్గరకొచ్చి, బ్యాంకు నోటీసు గురించి ఎత్తాడు ఇస్రూ... ఆ రాత్రి!

"యేటిజేత్తాం? యిసప్పురుగుల్ని నమ్మడమే మనం జేసుకున్న పాపం. ఇక, అది అనుబగించడమే. మన భూమీ, పుట్టనీ, పండించిన పంటనీ అప్పుల క్రింద సావుకార్లు నాక్కుంతే యేటనుబగించాం? టెంకపిండంబలీ, గెడ్డనీరే గదా...." అన్నాడు కొయ్యంగాడు.

"అదిగా సావుకార్లు అదేనా మిగిల్సినారు. యీ గవర్మెంటు అప్పు.... కోర్టూ, జెయిలూ సూపినట్టుగున్నాది..." అంటూ మాటగలిపాడు, అక్కడికే వచ్చిన బొంతు!

"ఇలాపింటి అక్రమాలు జరక్కుండా సంగందన్ను గుండీది. సక్క గుండోలిమప్పుడు, ఇదిగిపుడు సూడండి..." అని బాధపడ్డాడు కొయ్యం.

'అది గందికే గదా, యిదిగోలోన్సూ, యీస్కీములూ సెప్పి, బూరిసూపి బూకరించి, బులబాటం సేసారు...." అన్నాడు ఇస్రూ.

"దాచ్చారం సంతల కొంతాఁవు గేదెలన్నపుడేనా, మానుకున్నాము గాదు...." లోన్సు పెట్టినందుకు తప్పుబడ్తూ అన్నాడు బొంతు!

"అసలా, ఆఫీసర్లూ, ఎమ్మెల్లే... ఆలూ వొచ్చినపుడు, ఆ మొట్ట మొదల్లే దండఁ వెట్టీ వొలిసింది. అయితే, ఆళ్లెంత నమ్మించినారు....." అని కొయ్యం గతంలోకి, యీ కామధేను పథకం తమకు ఎలా పరిచయమయ్యిందో గుర్తు తెచ్చుకుంటున్నాడు. మిగతా ఇద్దరు గూడా ఆ ఆలోచనల్లోనే మౌనంగా వున్నారు!

❊ ❊ ❊

"సోదరులారా! ప్రియమైన ప్రజలారా! మీకోసం యిప్పుడు యిక్కడకు ప్రభుత్వమే తరలివచ్చింది. మిమ్మల్ని ఉద్ధరించడానికి పథకాలెన్నో పెట్టింది. మీరేమో సంగం, గింగం అని సావుని కోరుకుంటున్నారు. ఒద్దొద్దు సావడాలు, సంపడాలూ సేనాతప్పు. గాంధీగారు తెచ్చిన రాజ్యమిది. ఇక్కడ రక్తం సిందగూడదు! యెందుకొచ్చిన సావులు? బతికుంటే బలుసాకు తినొచ్చు. బలుసాకేటి బర్రెలు మేపుతూ బతకొచ్చు. మీకోసం, ప్రత్యేకంగా కామధేను పథకం కింద గేదెలు పంచడానికి ఇదిగో వీరు బీడీవోగారు, వీరు డిఆర్‌డిఏ పీడీగారు, వీరేమో బ్యాంకు ఫీల్డాఫీసరుగారు వచ్చారు!!" అని, తనతో పాటూ వచ్చిన ఆ ముగ్గురునూ పరిచయం చేస్తూ! వారు చెప్పినట్లు చేసి బాగుపడండి అన్నారు ఎమ్మెల్యే దొరగారు, బూర్జగూడ జనాలను సమావేశపర్చి!

దొరగారు కులరీత్యా ట్రైబుకి చెందిన జమీందారీ వంశీకులు. ట్రైబు రిజర్వేషన్ సౌకర్యంతో, దేశం స్వాతంత్ర్యం పొందిన నాటినుండి అధికార పార్టీ అభ్యర్థిగా అభివృద్ధి చెందుతూనే వున్నారు.

వీరివెంట, వారి కుడిభుజంలాంటి వారైన సమితి అధ్యక్షులు నాయుడుగారున్నారు. నాయుడుగారు గీతగీస్తే దాన్ని బీడీవోగారు జవదాటరు. వీరిద్దరూ ఎమ్మెల్యే దొరగారి గీతని జవదాటలేరు. ఈ నేతలంతా ఆఫీసులు దాటి వలసలకొచ్చారీవేళ!

బూర్జగూడ జనం, ఎమ్మెల్యేగారి మాటల్తో బీడీవో, పీడీగార్లవైపు చూడసాగారు. బీడీవో గారు "గిరిజన్ల కోసం ప్రత్యేకంగా గవర్నమెంటు కామధేను పథకం పెట్టింది" అన్నారు.... ఆయాసంతో! అప్పటికే ఆయన అలసిపోయారు. జీపుదిగి, ఈ కొండల్లో గూడలకు నడచిరావటం మాటలా!

బీడివో గారు బలంగానే వుంటారు. తల్లిపాలు వొదిలిన బిడ్డకి అన్నప్రాశన నుండి ఆయిదు విటమిన్లూ కలిపిమేపితే తయారైన భారీ శరీరంలా వుంటుంది బీడీవో గారి శరీరం! కానీ, ఆ భారీ శరీరం ఆరముగ్గిన దోసపండులా... శ్రమకు విలవిల్లాడింది.

బీడీవో గారి శ్రమని చూసి, చలించిన పిడీగారు, ఆయన్ని విశ్రాంతి తీసుకోమని, తాను చెప్పసాగారు పథకం గూర్చి! పీడీగారు నీరు ఆర్చే యిసగ్గడ్డిలో పెరిగిన తాటిమానులా ధృఢంగా, పొడుగ్గా వున్నారు. గొంతూ గంభీరమే!

"ఈ కామధేను పథకం ద్వారా మీకు ముర్రా గేదెలు సప్లయిజేస్తారు. ముర్రా గేదెలంటే ఎలాంటివనుకున్నారు? శిరానికి శేరు పాలు దిగుతాయి. ప్రొద్దున్నా, సాయంత్రం రోజుకి ఎనిమిదిశేర్లు దాటే.... పాలిస్తాయి" అన్నారు.

"నిజంగ?" నమ్మశక్యంగాక అడిగాడు సవర బొంతు.

"అనుమానమేటి? కచ్చితంగిస్తాయి. మన కొండ పశివిల్లాగ కాదు..." అన్నారు నాయుడుగారు నమ్మకంగా.

"అదుగో, అలాంటి గేదెలు మేపి, వాటి పాలను అమ్మి, మీరు అభివృద్ధి కావాల" అన్నారు పీడీగారు.

"పాలెక్కడ అమ్మాల? ఇక్కడ ఎవులూ కొన్రు. పట్నం తీసికెల్లి అమ్మాలా?" అడిగాడు భయపడుతూ కొయ్యంగాడు. యేఁవంటే పట్నంవారి కొనుగోలు ఎంత మోసమో తెల్సుగనక.

"అక్కర్లేదక్కర్లేదు, చెప్పానుగదా. మీరు గవర్నమెంటుకి ముద్దుబిడ్డలయిపోనారని. మీరా నక్సలైటుల్ల చేరిపోవడం కాదుగానీ, మీ కోసం గవర్నమెంటు కదిలింది. మీ ఇళ్లముందు కొచ్చింది. బేంకు ద్వారా గేదెలు, పీడీగారి ద్వారా సబ్సిడీ యిస్తందా? ఇక, ఈ గేదెల పాలు కొనడానికి పాడిపరిశ్రమాభివృద్ధి సంస్థవారి పాలవేను రోజూ మీ దగ్గరకొస్తుంది...." అన్నారు ఎమ్మెల్యే గారు!

"మా గూడ కెలాగొస్తాది బావ్? రోడ్డున్నాదా? యేటి?" అని అడిగాడో గిరిజనుడు.

"మీ బూర్జగూడకి కోసుడు దూరాన, దిగువన అటు పడమరకాసి కొత్తూరు

రోడ్డు లేదర్రా...? అక్కడికొస్తాది వేను. ఆ వేనులో పాల కంపెనీ గుuవాస్తా వుంటాడు. మీరక్కడికి తీసికెళ్లి, అతగానికి పాలు ఇచ్చీడమే...." అన్నారు సమితి అధ్యక్షులు నాయ్డుగారు.

"యేరోజు డబ్బులారోజూ యిచ్చేత్తాడా?" అనుమానంగా అడిగాడు ఇస్రూ.

"పిల్లి చవ్వకముందు వొట్టల పంపకం లాగుంది. గేదెలేనా రాలేదు. అప్పిడే పాల డబ్బుల గురించడిగేత్తండు" అని గసిరేడు మరోడు.

"డబ్బులివ్వరు. మీకో పుస్తకమిస్తారు. అందులో నీ పేరురాసి, తేదీల వారీగా ఉదయం, సాయంత్రం మీరిచ్చే పాలను లెక్క రాస్తారు. వాటికి డబ్బు లెక్కగట్టి; నెలకోసారి ఆ డబ్బు బ్యాంకులో మీ పేర్న జమ చేస్తారు..." అన్నారు బీడీవో గారు అప్పటికి ఆయాసం తీర్చుకొని.

"యేటో? యీ తిరకాసులేటి మాకు తెలవ్వు. అప్పులు ఎలాగ ముంచుతాయో సావుకార్ల పున్నేన అనుబగించినాం. వొద్దొద్దు బావో.... యీ కొత్తప్పులు..." అన్నాడు కొయ్యంగాడు భయపడుతూ.

"కండగుత్తలమీద పల్లం సావుకార్ల కాడ అప్పులోడీసి సెడిపోయిందానికీ, గవర్నమెంటు సబ్సిడీమీద బ్యాంకు లోన్లుకీ తేడాలేదురా? బోల్డు తేడా...! గవర్నమెంటు లక్షలు, లక్షలు దేనికిస్తుంది? మిమ్మల్నుద్ధరించడానికే. ఈ జీపులూ, ఆఫీసులూ, ఆఫీసర్లూ దేనికోసం...? మీ కోసమే! మిమ్మల్నుద్ధరించడానికే గవర్నమెంటు పంపింది" అని ఎమ్మెల్యే దొరగారు అన్నిటినీ సాక్ష్యంగా నమ్మబలికారు.

నిజమేగావాల, నేపోతే యీ ఆఫీసర్లూ, యీ నాయకులూ యింత కష్టపడి యిక్కడ కేలవొత్తారు? నిజింగ, గేదెల్తోటి బాగుపడొచ్చుగానాల! – అనుకున్నారంతా ఆనాడు!

అదిగో ఉద్ధరిస్తాదనుకున్న ఆ కామధేను పథకమే, యివ్వాళ పోస్టుమేన్ తెచ్చిన నోటీసుల్తో వారి కాళ్లకింద భూమిని కదిలించింది. పెంచిన కామధేను పెద్దపులై మీదకొస్తున్నట్లూ....దానికి అందకుండా రక్షణ ఎక్కడ పొందాలో అని, ఆ రాత్రి సతమతమయ్యే ఆ ముగ్గుర్నీ మరో పదిహేను రోజులకు... కోర్టుకు ఈడ్చింది!

✳ ✳ ✳

కోర్టు భవంతి కోలాహలంగా వుంది. అప్పుడప్పుడు కోర్టు జవాను నక్కలా ఊళేస్తూ.. ఎవర్నో పేరుపెట్టి పిలుస్తున్నాడు. కోర్టు భవంతి ఆవరణలో చెట్లు, కోర్టెక్కి ఆస్తులు పోగొట్టుకున్న వారిలా దిగులుగా, చీకటిగా నిల్చున్నాయి. నల్లకోటు లాయర్లూ, తెల్లబట్టల గుuవాస్తాలూ, మధ్యవర్తి పెద్దమనుషులూ... వారి, వారి లావాదేవీల్లో ఆతృతగా తిరుగాడుతున్నారు.

ఇంతలో – సవర కొయ్యంగాడూ, వగైరాలు అనే ఊళ మూడుసార్లు విన్పించింది!

గాభరాగా కొయ్యం, భయం భయంగా బొంతు, విచారంగా ఇస్రూ ముగ్గురూ కోర్టు హాలులోకి వెళ్లారు.

కోర్టువారి సాధారణ కార్యక్రమమయ్యాక, బ్యాంకు వారి లాయరు లేచి : – గవర్నమెంటు వారి సంక్షేమ పథకాల గూర్చి, వాటిని అమలుజేయటంలో బ్యాంకుల పాత్ర గురించీ కొంత చెప్పి; కామధేను పథకం కింద ఋణం పొందిన యీ ముగ్గురూ, తిరిగి బ్యాంకుకు ఋణం చెల్లించలేదనీ, కోర్టువారు తగుచర్య తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మేజిస్ట్రేటుగారు చిరాగ్గా కదిలారు కుర్చీలో! చురుగ్గా ఋణగ్రస్తుల వైపు చూసారు! చూసి –

"యేఁవయ్యా? విన్నారా, లాయర్‌గారి ఆరోపణలు" అని అడిగారు.

"ఊఁ....." అన్నట్లుగా తలలూపారు ముగ్గురూ.

"బాకీ ఎందుకు తీర్చలేదు? కామధేను పథకం గేదెలేమయినాయి?" అని అడిగారు మేజిస్ట్రేటుగారు.

"యెందుకు తీర్చనేదు, యేటయిపోనాయి గేదలంతే.... మీమేటిసెప్పగలము? మా బతుకులేటిలాగ కడతేరిపోతున్నాయని – కానరాని దేవతలందరికీ మొక్కులు మొక్కి.... యిదిలాగ మిగిలినోలిమి!" అన్నాడు కొంచెం ధైర్యం చేసుకుని, కొయ్యం!

"మిమ్మల్ని ఉద్ధరించడానికే గదా ప్రభుత్వం ఎన్నో పథకాలు పెట్టింది. మీకిస్తోంది. ఇంకా యేఁవిటి మీ బాధ?" అన్నాడు. మేజిస్ట్రేటు గారు... యింకా వారు ఉద్ధరింపబడలేనందుకు విస్తుపోతూ!

"....బావో, సీఁవలెట్టుకున్న పుట్టల్లోకి పాఁవుల్దూరితే, సీఁవల కేటవుతాదో మీకు తెలన్దా? మా సెఁవటా నెత్తురు పంటలే మాకు దక్కటంనేదు. యింకా మీకు బాధేటంతే.... యేటి సెప్పాల? మా బతుకే బాధ..." అన్నాడు మళ్లీ కొయ్యం.

"బతుకు సంగతెందుగ్గానీ, బాకీ సంగత్చెప్పు" అన్నారు బ్యాంకు లాయర్.

"బాకీ సంగతే సెప్తాను. గానీ బావ్.... మీలాంటి సదుంకున్నోలయితే దాన్ని కతలాగ, పురాణంలాగ సెప్పగల్రు! కొండముండా కొడుకుని... మీకెలాగ సెప్పను? అందుకని కసింత ఓర్సి యినండి.

పచ్చటి అడివితోటి, కొండపోడుల్తోటి; పల్లపు భూఁవుల్తోటి కొండ రాజుల్లాగ బతికీవోలిమి... మా సవరోలిమి మాకు మీనాగ పెంకుటిల్లులూ, డాబాలూ నేకపోయినా, మీ కరెంట్లూ, కార్లూ, బస్సులూ రాకపోయినా; మీ సదువులూ, సాములూ మీము ఎరక్కపోయినా అడివితల్లి వొడిలోని సంపదలన్నీ మాకే దక్కేవి. కన్నతండ్రుల్లాగ కొండలాదుకుండీవి. పట్టుతేనె జుర్రుకొని పండుగూ, పున్నఁవూ..... పదుగురిమీ కలిసి

సేసుకునీవొలిమి! కలిసి, మెలిసి గూడంతా ఒక కుటమాంలాగుండోలిమి. మాకు ఆకలి తెలీదు....సోకులూ తెలీవు. ఇదంతా ఎప్పుడి మాటో కాదు బావ్.... నలభయ్యి పంటలకిందటిదే!

అదిగలాపింటపుడొచ్చారు, తొలీత సొండోలు. యిప్ప సారానేర్పినారు. అదిగాల్తోటి, ఆ యెనక సిల్లర దుకానంపు సావుకార్లొచ్చినారు. అప్పొ, అన్నా వరసలు కట్నారు. నేస్తరికాలు అల్లినారు. పట్నం సరుకుల్ని కొండలకి తెచ్చారు. కొండ పంటల్ని కొనడమారంభించినారు. కాతాలిచ్చినారు. మా కండలు సలసల్లగ కాతాలకింద కోతగోస్పినారు. అప్పులిచ్చినారు, మా భూంవీ పుట్టా సుట్టేసుకున్నారు. మాంవు యేటయి పోతన్నాంవో కానుకుండీ సరికి కంబారోలిమయిపోనాము!

యిదిగీల్తోటి పారెస్టోలు, పోలీసోలు, శిస్తులోలు.... యిలాగ గవర్మెంటోలు కలిసిపున్నారు. అంతాగలిపి, మేకల్నాటి మా కొండోల్ని యేటాడీసుకున్నారు! సరిగ్గా, యిప్పుడికి యిరవయి పంటల కిందట మా బతుకుల్ని సక్కదిద్దడంకి, మమ్మల్ని సల్లగ కాపాడ్డాన్కి, మా కోసం సంగాన్ని పంపింది జాకర్దేవత! సంగంజెండా జాకర్దేవత జెండా పక్క పక్కన ఎగరేసినాం. ఎత్తుకుముత్తుం పాయిదాలకి పోగొట్టుకున్న భూంవులు యిడిపించుకున్నాంవు. అక్రమానం యాపారాల్ని అడ్డుకున్నాం. మా పంటల్ని మాంపు అనుబగించాం. గవర్మెంటు ఉజ్జోగస్తుల దోతర్పినెదిరించినాం. నేయం, ధరమం మా సంగం నీడల సూసుకున్నాం.

అంతెందుకు బావో, గుడ్డోడికి సూపు వొత్తే కనబడీ ఎలుతురు నాగ సంగం మా బతుకుల్లోని సీకట్ని సెరిపేసింది. ఎలుతురు నింపింది. కానేట్నాబం!? జాకర్దేవత జాలి సూపిందిగానీ, ఏలినోరు సూపనేదు. కన్నెర్ర సేసినారు. మమ్మల్ని నరుకోతలోలన్నారు, నక్సలయిటోల్లన్నారు. మా గోసీ గొడ్డల్లని జెయిల్లెట్టినారు. మా గూడేలకి నిప్పెట్టినారు. మా కొండ కొండకీ తుపాకీ గుండు గురిబెట్టినారు. మీము మేకల మందలయితే, సంగపోలు మాకు మందబేపుల్నాగ కాపుగాసీవోరు. ఇప్పుడు మందబేపులూ నేవు, మేకలూ నేవ్ బావ్, నేవు బావ్.... దిక్కులేని పచ్చులమయిపోనాము" అని యేడుపు ముంచుకు రాగా గొంతు జీరబోయి ఓ క్షణం ఆగాడు. మనసు దిటవుపర్చుకొని మళ్లీ ప్రారంభించాడు.

"అన్నిజేసి.... అప్పుడు ఆమెతలెడతాం రమ్మన్నారు. సబ్సిడీలన్నారు. కోలనీలన్నారు. బంజిరీ భూంవులన్నారు. యేటేటో సెప్పినారు. కాలిపోయిన మా అరిసేతుల్ల సొరగం చూపించినారు. అదిగో, అలాగ పదిపంటల కిందట యీ పథకమొచ్చినాది బావ్. సిరానికి సేరు పాలిచ్చే గేదలన్నారు. గవర్మెంటు సబ్సిడీ యిత్తాది. సగం ఋణమే తీర్చుకోవాలన్నారు. పాల కంపెనీవోళ్లు పాలు కొంతారన్నారు. బాగుందనుకున్నాం. దరకాస్తు లెట్టండంతే.... యెట్నాం. యికక్కడి కాంచి, దరకాస్తు కర్సులూ, దారి కరుసులూ అని కొంత పిండీసినారు

ఆఫీసర్లు. ఇంకా మిగిలింది దాచ్చారం. సంతల దళారోడు పిండీసినాడు. అయిదొందలు సెయ్యని గేదని యెయ్యి రూపాయిల క్రింద నారీ లెక్కించినారు!

గవిరేపున్నానికి నందెమ్మని దించినట్టగ నారీల్నిండి గేదల్ని దించుకున్నాం. మా కొండగాలి పడక కొన్ని గేదల చూలుపోనాయి. కొన్ని జబ్బుల్తోటి సచ్చినాయి. మా బూర్జిగూడల మా ముగ్గురి గేదలూ బతికినాయి. ఈత యీనినాయి. మీము పొంగిపోనాము. పాలు వొట్టికెల్లి కంపెనీ వోలికిచ్చీ వోలిమి. ఆ పాల కంపెనీ గుండాస్తా రశీదు ముక్కలిచ్చీవోడు. ఇదిగివే మిగిల్నాయి (అని, తమ దగ్గర గల పాలకంపెనీ వారి రశీదులు ఇచ్చాడు). ఆటి డబ్బులు మాత్తరం బేంకీల జెమకానేదట! మాకా సంగత్తెల్దు. గేదెలొట్టి పోయిన్దాకా పాల కంపెనీకి పాలు పోసినాం. బేంకీ బాకీ తీరిపోనాదనుకున్నాం.

గేదలొట్టిపోనాయి. మళ్లీ చూలున్నిదాక పెంచినాం. గాని, నిండా చూలుటయింల సంచలేసి సచ్చిపోనాయి.... పశివిలు! నందెమ్మని అనిపీసినాం అనుకున్నాం. అంతే బావ్. అంతే! ఆ తర్వాత, యిన్నేళ్లకి బేంకీ కాంచి యీ నోటీసులొచ్చీసరికి గడగడ లాడిపోనాం. ఉరులుమద్దిన పడిపోయిన కుందేలు పిల్లల్నాగ అయిపోనాం!

యిప్పుడు  సెప్పండి బావ్. కామధేను ఎవులి కడుపులు నింపిందో? యెవలి పాడీ పంటని పెంచిందో? యెవుల్ని వుద్దరించినాదో? యిప్పుడు సెప్పండి బావ్. మీమింకా ఎవులికి బాకీ పడిపోనామో సెప్పండి బావో... సెప్పండి" అని అంతా వివరించి ప్రశ్నించాడు కొయ్యం.

మేజిస్ట్రేటు గారి మొహం ఎందుకో ఎర్రబారింది. దీర్ఘంగా కొయ్యంగాడ్ని చూస్తూ తల పంకించారు!

"బాబులూ.... వొగ్గీయండి. మమ్మల్నొగ్గీయండి. మా మానాన మమ్మల్నొగ్గీయండి. మా పోడునీ, గూడలనీ; మా భూంవుల్నీ... మమ్మల్నీ వొగ్గీయండి. మా బతుకు మీము సల్లగ బతగ్గలము.

మాకీ యాపీసులొద్దు. ఆపీసర్లొద్దు, అప్పు సప్పులొద్దు. ఆటికి సబ్సిడీలొద్దు. వొద్దు బాబో వొద్దు... మీ కాయితం, కలాల వొయికుంత పాలీలాటలొద్దే వొద్దు! మమ్మల్ని పాంవులు మింగేత్తాయి. అవునుబావ్. మమ్మల్నొగ్గీయండి. యిది నా ఒక్కడి గోసకాదు. మా ఆడివి బతుకోలందరి గోస....!" అని ప్రార్థించాడు కొయ్యం.

న్యాయశాస్త్రాని కందని జన జీవితాన్ని కొయ్యంగాడు వివరించే సరికి.. చల్లటి రెబ్బ కొండగాలికి రగ్గుదీసి కప్పుకునే పల్లపు సావుకారిలా మేజిస్ట్రేటుగారు చలించిపోయి (!?) కేసు వాయిదావేసి... కోర్టు హాలు నుండి నిష్క్రమించారు!★

*అరుణతార, ఆగస్ట్ 1987*